సాక్షి
తిరుపతి
శనివారం । 1 । ఫిబ్రవరి । 2025



కూటమి దౌర్జన్యకాండ..
వెంకటగిరిలో రెడ్ బుక్ రాజ్యాంగం రాజ్యమేలుతోంది. వైఎస్సార్‌సీపీ నేతలే టార్గెట్‌గా రెచ్చిపోతోంది. - 8లో



వసతిగృహాల్లో..
ఎస్సీ వసతి గృహాల్లో మెరుగైన సౌకర్యాలే లక్ష్యంగా చర్యలు చేపట్టనున్నట్లు ఆ విభాగం జిల్లా అధికారి స్పష్టం చేశారు. - 8లో



నిర్లక్ష్యం జాతర.. ల్యాబ్‌లకు పాతర!
జిల్లాలో కూటమి ప్రభుత్వం ఇంటర్ ప్రాక్టికల్స్‌కు సంబంధించిన ల్యాబ్‌లను నిర్లక్ష్యంగా వదిలేసింది. - 8లో

న్యూస్‌రీల్

మహాశివరాత్రి ఉత్సవాలపై నేడు సమీక్ష

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈ నెలలో జరగనున్న మహాశివరాత్రి ఉత్సవాలకు సంబంధించి రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సమీక్షించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, కలెక్టర్ వెంకటేశ్వర్ కూడా ఈ సమావేశంలో పాల్గొనున్నట్లు పేర్కొన్నారు.

క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తే రూ.5వేలు



అవగాహన ర్యాలీలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, రవాణాశాఖ అధికారులు

తిరుపతి మంగళం : రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు క్షతగాత్రులను తక్షణమే ఆస్పత్రికి తరలించే ప్రక్రియలో సహాయపడే వారికి ప్రోత్సాహకంగా రూ.5వేలు నగదు బహుమతిగా ఇవ్వడంతో పాటు ప్రశంసా పత్రం అందజేస్తామని జిల్లా రవాణాశాఖాధికారి కొర్రపాటి మురళీ మోహన్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బాలకృష్ణనాయక్ తెలిపారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్విమ్స్ ఆస్పత్రి సర్కిల్ వద్ద రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారిని ఆస్పత్రులకు తరలించడంపై ప్రజలకు అవగాహన కల్పించారు. క్షతగాత్రుని తరలించే అంశంలో సహాయపడిన వ్యక్తికి పోలీస్ నుంచి న్యాయస్థానం వరకు చట్టబద్ధమైన రక్షణ ఉంటుందని మోటార్ వాహనాల తనిఖీ అధికారి అతికా నాజ్ తెలిపారు. అంతకుముందు పాత మెటర్నిటీ ఆస్పత్రి నుంచి సిమ్స్ హాస్పిటల్ వరకు జిల్లా ప్రధాన వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయ సిబ్బందితో ప్రచార ర్యాలీ నిర్వహించారు.

డిప్యూటీ మేయర్ ఎన్నిక ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న జేసీ శుభం బన్సల్

తిరుపతి సిటీ: తిరుపతి నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ ఎన్నికలు ఈనెల 3వ తేదీన జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ప్రత్యేక సమావేశం కోసం ఎస్వీయూ సెనేట్ హాల్‌ను జేసీ, ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి శుభం బన్సల్ శుక్రవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిబంధనల మేరకు ఏర్పాట్లు ఉండాలని ఆదేశించారు. అలాగే ఎన్నికల ప్రక్రియ పూర్తి వీడియో రికార్డింగ్ చేయాలని సూచించారు. సంబంధిత పార్టీ ప్రతినిధులు విప్ జారీ ప్రతులను సంయుక్త కలెక్టర్‌కి ఫిబ్రవరి రెండో తేదీ ఆదివారం ఉదయం 9 నుంచి 11 గంటల్లోపు అందజేయాలని చెప్పారు. 3వ తేదీ 11 గంటలకు ప్రత్యేక సమావేశం నిర్వహించనున్న నేపథ్యంలో సంబంధిత కౌన్సిలర్లు, ఎక్స్ అఫీషియో సభ్యులు ఎస్వీయూలోని సెనేట్ హాల్‌కు హాజరు కావాలన్నారు. అదనపు ఎస్పీ రవి మనోహరాచారి, డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ అమరయ్య, డీడీ బాలకొండయ్య పాల్గొన్నారు.

ఎన్నికల ముందు నుంచి మద్యం ప్రియులనే టీడీపీ టార్గెట్ చేసింది. భారీగా ధరలు తగ్గిస్తామని ఊదరగొట్టింది. తీరా అధికారం చేపట్టాక కూటమి ప్రభుత్వం రూ.100కే మద్యం అంటూ జబ్బలు చరిచింది. ఏడాది కూడా గడవక ముందే కల్తీ మద్యానికి బాటలు వేసింది. ఇదే అదనుగా నకిలీ ముఠా రెచ్చిపోయింది. పేదల బ్రాండ్లుగా గుర్తింపు పొందిన రూ.100, రూ.130 మద్యాన్ని కల్తీ చేసేందుకు శ్రీకారం చుట్టింది. తిరుపతి సమీపంలోని దామినేడులో పట్టుబడిన కల్తీ మద్యం ముఠాను చూస్తే ఇదే అర్థమవుతోంది. తాము సేవించే మద్యాన్ని కల్తీ చేస్తున్నారేమోనని మద్యం ప్రియుల్లో భయాందోళన మొదలైంది.



దామినేడులో పట్టుబడ్డ స్పిరిట్, నకిలీ మద్యం, స్టిక్కర్లు, లేబుళ్లు

పేదల బ్రాండ్లు కల్తీ!

- దామినేడులో భారీగా కల్తీ మద్యం స్వాధీనం
- రూ.100, రూ.130 మద్యం సీసాల్లో కల్తీ జరిగినట్లు అనుమానం!
- పేదల ప్రాణాలతో కూటమి ప్రభుత్వం చెలగాటం
- తక్కువ ధర అని చెప్పి కల్తీ మద్యాన్ని అంటగడుతున్నారా?
- విచ్చలవిడి మద్యం వెనుక అనుమానాలెన్నో?
- ముఠా గుట్టురట్టు కావడంతో మద్యం ప్రియులు షాక్

సాక్షి టాస్క్‌ఫోర్స్: కల్తీ మద్యం వెలుగు చూడడంతో మద్యం ప్రియులు షాక్‌కు గురయ్యారు. విచ్చలవిడి మద్యం వెనుక కల్తీ ఉందా? అనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. తక్కువ ధర అని చెప్పి కల్తీ మద్యాన్ని అంటగడుతున్నారా..?అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తిరుపతి సమీపంలోని దామినేడు ఇందిరమ్మ కాలనీలో శుక్రవారం కల్తీ మద్యం ముఠా గుట్టురట్టు కావడంతో భయంతో వణికిపోతున్నారు. దీని వెనుక ఎవరి హస్తం ఉందోనని..? పలువురు ఆరా తీసే పనిలో పడిపోయారు.

మద్యం దుకాణాల్లో కూడానా?

నకిలీ మద్యం కేవలం బెల్టు షాపులకే సరఫరా చేస్తున్నారా? లేక మద్యం దుకాణాలకూ పంపిణీ చేస్తున్నారా? అనేది తేలాల్సి ఉంది. పోటీపడి టెండర్లు దక్కించుకున్న కొందరు మద్యం వ్యాపారులు పెట్టిన పెట్టుబడి రాబట్టుకోవడానికి నకిలీ మద్యాన్ని కొనుగోలు చేస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. ఈ నకిలీ మద్యాన్ని ఒకరిద్దరే కొనుగోలు చేస్తున్నారా? ఎక్కువ మంది తీసుకెళ్తున్నారా? అనేదానిపై విచారణ చేపట్టాల్సి ఉంది.

ఇంకా ఎక్కడెక్కడున్నాయో?

కూటమి ప్రభుత్వం వచ్చాకే ఈ నకిలీ మద్యం తయారీ ముఠా తెరపైకి వచ్చింది. అంతకుముందు ఇటువంటి ఘటనలు లేవని అధికారులు చెబుతున్నారు. ఈ నకిలీ ముఠా కేవలం దామినేడు వద్దే కాకుండా.. మరిన్ని చోట్ల తయారు చేస్తున్నట్టు ఎక్సైజ్ అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కేవలం దామినేడు వద్దే భారీ ఎత్తున నకిలీ మద్యం దొరికితే.. మిగిలిన చోట్ల ఇంకెంత నకిలీ మద్యం లభ్యవుతుందోనని మద్యం ప్రియులు ఆందోళన చెందుతున్నారు.

నకిలీ మద్యం ఇస్తారా?

దామినేడు వద్ద దొరికిన నకిలీ మద్యం విషయం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దావానంలో వ్యాపించింది. ఎన్నికలకు ముందు తక్కువ ధరకే నాణ్యమైన మద్యం సరపరా చేస్తామని హామీ ఇచ్చిన కూటమి పెద్దలు.. నకిలీ మద్యాన్ని తక్కువ ధరకు ఇచ్చి తమ ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారా? అంటూ మద్యం ప్రియులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. నకిలీ మద్యం తయారీ వెనుక ఎవరి ప్రమేయం ఉంది? ఇందుకు సహకరించిన వారెవరు? ఈ నకిలీ మద్యాన్ని ఎప్పటి నుంచి ఎక్కడెక్కడికి సరఫరా చేశారు? అనే విషయాలు వెల్లడించాలని మద్యం ప్రియాలు డిమాండ్ చేస్తున్నారు.

ఆ బ్రాండ్లే టార్గెట్

కూటమి ప్రభుత్వం వచ్చాక మద్యం ఏరులై పారిస్తోంది. ఎక్కడ చూసినా బెల్టుషాపులు, అనధికారిక దుకాణాలు ఏర్పాటు చేసి మద్యం విచ్చలవిడిగా విక్రయిస్తోంది. ఇందులో పేదలు అధికంగా సేవించే రూ.100, రూ.130 రకాల బ్రాండ్లు ఒకరోజు ఉన్న టేస్ట్ మరో రోజు లేదని మద్యం ప్రియులు చెబుతుండడం పలు అనుమానాలకు తావిస్తోంది. శుక్రవారం దామినేడులో పట్టుబడిన కల్తీ మద్యంలో ఎక్కువగా పేదలు తాగే బ్రాండ్లే ఉండడం దీనికి మరింత బలం చేకూరుతోంది. స్వాధీనం చేసుకున్న లేబుళ్లన్నీ రాయల్ క్యాన్ విస్కీ, ట్రాపికానా బ్రాందీ, హనీబీ బ్రాందీ, కేరళ మాల్ట్ విస్కీ, మంజీరా, నైసీ హార్స్, సెలబ్రిటీ చాయిస్ కంపెనీలకు చెందినవే ఉండడం గమనార్హం.



బాటిళ్లలో నింపిన నకిలీ మద్యం



నకిలీ మద్యం బాటిళ్ల తయారీకి ఉపయోగించిన పరికరాలు

మార్కెట్‌లోకి నకిలీ మద్యం!

కూలీలు, పేదలు కొనుగోలు చేసే బ్రాండ్లే లక్ష్యంగా నకిలీ మద్యం తయారు చేసినట్టు తేటతెల్లమైంది. శుక్రవారం దామినేడులో 23 క్యాన్లలోని 805 లీటర్ల స్పిరిట్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వాటితో పాటు 6,600 ఖాళీ మద్యం సీసాలు, పెద్ద ఎత్తున నకిలీ లేబుళ్లు, ఖాళీ మద్యం సీసీ మూతలను స్వాధీనం చేసుకున్నారు. తక్కువ ధరకు లభ్యమయ్యే మద్యాన్నే పేదలు కొనుగోలు చేస్తుండడం గ్రహించి వాటి పేరుతో నకిలీ మద్యాన్ని తయారు చేసినట్టు తెలుస్తోంది.

బెల్టు దుకాణాలకు కల్తీ మద్యం!

కూటమి ప్రభుత్వం వచ్చాక మద్యం ప్రియులను లక్ష్యంగా చేసుకుని విచ్చలవిడిగా విక్రయాలు పెంచింది. తక్కువ ధరకే మద్యం అని చెప్పి చీప్ లిక్కర్‌ని విక్రయించడానికి శ్రీకారం చుట్టింది. విక్రయాలను భారీగా పెంచేందుకు బెల్టు దుకాణాలను తీసుకొచ్చింది. కూటమి నేతల కనుసన్నల్లో గ్రామ గ్రామాన, వీధి వీధిన ఈ బెల్టు దుకాణాలు వెలిశాయి. ఈ దుకాణాలు నిర్వహించే వారు పది రూపాయలు ఆదాయం కోసం ఏ బ్రాండ్ తక్కువ ధరకు వస్తే.. ఆ బ్రాండ్‌నే కొనుగోలు చేసి విక్రయిస్తున్నారు. బెల్టు దుకాణాలపై ప్రభుత్వం చూసీ చూడనట్లు వ్యవహరిస్తుండడంతో వారికి అడ్డే లేకుండా పోతోంది. ఈ నేపథ్యంలో కల్తీ మద్యం ఎక్కువగా బెల్టు దుకాణాలకే చేరినట్టు తెలుస్తోంది.

పేద విద్యార్థులతో చెలగాటమా?

- ఉన్నత విద్య అందించేందుకే ఫీజురీయింబర్స్‌మెంట్
- కూటమి ప్రభుత్వం వచ్చాక తూట్లు
- 5న ఫీజు పోరు
- పోస్టర్ ఆవిష్కరించిన భూమన అభినయ్, మేయర్ శిరీష

తిరుపతి మంగళం : కూటమి ప్రభుత్వం పేద విద్యార్థులకు అందించాల్సిన ఫీజురీయింబర్స్‌మెంట్ అందించకుండా వారి జీవితాలతో చెలగాటమాడుతోందని వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి మండిపడ్డారు. తిరుపతి పద్మావతిపురంలోని తన నివాసం వద్ద శుక్రవారం ఫిబ్రవరి 5వ తేదీన చేపట్టనున్న ఫీజుపోరు పోస్టర్‌ను నాయనతోపాటు మేయర్ డాక్టర్ శిరీష, పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం అభినయ్ మాట్లాడుతూ కేవలం అధికార దాహంతో చంద్రబాబు నోటికొచ్చినట్లుగా అబద్ధాలు చెప్పారని ధ్వజమెత్తారు. అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు అవుతున్నా ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీల్లో ఏ ఒక్కటీ నెరవేర్చిన పాపానపోలేదన్నారు. అమ్మకు వందనం, ఫీజురీయింబర్స్‌మెంట్ చెల్లించకుండా పేదల జీవితాలతో చెలగాటమాడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగనన్న పాలనలో పేద విద్యార్థులు ఎంతో ఉన్నత స్థాయికి ఎదిగారని గుర్తుచేశారు. జగనన్న ఆదేశాల మేరకు పార్టీ జిల్లా అధ్యక్షులు భూమన కరుణాకరరెడ్డి ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం మెడలు వంచి ఫీజురీయింబర్స్‌మెంట్ చెల్లించేలా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ప్రజలతో కలిసి ఫిబ్రవరి 5వ తేదీన ఫీజుపోరు చేపట్టనున్నట్లు తెలిపారు. అనంతరం మేయర్ శిరీష మాట్లాడారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి ఫీజురీయింబర్స్‌మెంట్ పథకాన్ని ప్రవేశపెట్టారని, తండ్రి ఆశయాలకు అనుగుణంగా అమ్మ ఒడి, ఫీజురీయింబర్స్‌మెంట్ పథకాలను జగనన్న అందిస్తూ పేద విద్యార్థుల ఉజ్వల భవితకు బంగారు బాటలు వేశారన్నారు. కానీ కూటమి ప్రభుత్వం పేద విద్యార్థులకు ఉన్నత విద్య అందకుండా చేస్తోందన్నారు. కార్పొరేటర్ ఎం.శేఖర్‌రెడ్డి, పార్టీ నాయకులు మల్లం రవిచంద్రారెడ్డి, ఉదయ్‌వంశీ, ఇమ్రాన్‌బాషా, అనీల్, కోదండ, సాయికుమారి, మురళి పాల్గొన్నారు.



ఫీజుపోరు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న భూమన అభినయ్‌రెడ్డి, మేయర్ శిరీష, పార్టీ నాయకులు

రిజిస్ట్రేషన్ల సందడి

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట): రేణిగుంట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో సందడి నెలకొంది. రాష్ట్ర ప్రభుత్వం భూముల రిజిస్ట్రేషన్‌పై ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి 10–20 శాతం రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచుతున్నట్లు ప్రకటించడంతో 31వ తేదీ శుక్రవారం క్రయవిక్రయదారులు బారులు తీరారు. రాత్రి 8 గంటలవుతున్నా కార్యాలయంలో ఏ మాత్రం ఖాళీ లేకుండా నిండిపోయారు. రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు కొందరు లాబీయింగ్ చేస్తుండగా మరికొందరు డాక్యుమెంట్ రైటర్ల ద్వారా అధిక మొత్తంలో కమీషన్లు ఇచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకునే విధంగా చేయడం గమనార్హం.



కార్యాలయం వెలుపల వేచి ఉన్న జనం

కొట్లాట ఖనిజం!

- మైన్స్ కోసం పోటీపడుతున్న ప్రజాప్రతినిధులు
- తల పట్టుకుంటున్న లీజు పొందిన స్థల యజమాని

సాక్షి టాస్క్‌ఫోర్స్ : అధికారంలోకి వచ్చిన కూటమి ప్రజాప్రతినిధులు తెల్లరాయి మైన్ల కోసం కుస్తీ పడుతున్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని తెల్లరాయిని ఒక్కరే చేజిక్కించుకోవాలని ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తుంటే.. తమ ప్రాంతంలోని మైన్లపై మరొకరి పెత్తనం ఏంటి..? అని గూడూరుకు చెందిన ప్రజాప్రతినిధి అసహనం వ్యక్తం చేస్తున్నారు. తన పరిధిలోని మైన్‌లు తమకే ఉండాలని పట్టుబడుతున్నట్లు తెలుస్తోంది. దీంతో లీజు పొందిన యజమాని తన 10 ఎకరాల పట్టా భూమిలోని మైన్‌ను ఎవరికి ఇవ్వాలనే మీమాంసలో పడిపోయారు. ఇది గూడూరు రూరల్ ప్రాంతంలోని ఓ తెల్లరాయి మైన్ కథ.

నువ్వా..నేనా?

గూడూరు రూరల్ ప్రాంతంలోని తన సొంత పట్టా భూమిలో తెల్లరాయి ఉందని తెలుకున్న యజమాని రెవెన్యూ, గనుల శాఖాధికారుల నుంచి 10 ఎకరాలలో తవ్వకాలు చేపట్టేలా అనుమతులు పొందాడు. తవ్వకాలకు పూర్తిగా అనుమతులు మంజూరు చేసిన తరువాత సొంతగా వ్యాపారం చేసుకోవాలని అనుకున్నాడు. అయితే దీనిపై కన్నేసిన స్థానిక ప్రజాప్రతినిధి మైన్ యజమానితో మంతనాలు జరిపారు. మైన్‌ను తనకు అప్పగించేలా ఒప్పందం చేసేకునే ప్రయత్నాలను ముమ్మరం చేశారు. అయితే ఉమ్మడి జిల్లాలోని సైదాపురం ప్రాంతంలో ఉన్న తెల్లరాయి మైన్‌లను ఉమ్మడి జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధికి అప్పగించేలా ప్రభుత్వంలోని పెద్దలు సన్నాహాలు చేస్తుండగా గూడూరు ప్రాంతంలోని మైన్‌లను కూడా ఆయనకే కట్టబెట్టాలని నిశ్చయించారు. ఆ ప్రజాప్రతినిధి ఎన్నికల సమయంలో ఈ ప్రాంతంలో సహాయ సహకారాలు అందించి ఉండవచ్చుగానీ ఎన్నికల అనంతరం కూడా ఈ ప్రాంతంలోని సహజ సంపదపై పట్టు సాధించాలనుకుంటే పార్టీని నమ్ముకుని ఇక్కడ ఉన్న నాయకులు, కార్యకర్తల మాట ఏంటని స్థానిక ప్రజాప్రతినిధి ప్రశ్నిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో ఒక మైన్ విషయంలో నువ్వా- నేనా అన్నట్లు కూటమి ప్రభుత్వంలోని ఇద్దరి ప్రజాప్రతినిధుల మధ్య వివాదం ముదిరింది. దీంతో లీజు పొందిన మైన్ యజమాని ఎటూ తెల్చుకోలేక సతమతమవుతున్నట్లు సమాచారం. వ్యాపారాలు చేసుకునే వారిని ఇలా ఇబ్బంది పెట్టడం ఎంతవరకు సబబని తన సన్నిహితుల వద్ద ఆయన వాయిపోయినట్లు తెలుస్తోంది. గతంలో ఇదే పెద్దలు అక్రమంగా వ్యాపారాలు చేస్తున్నారని గగ్గోలు పెట్టి నేడు మాత్రం ఇలా మైన్‌ల యజమానులను భయపెట్టి, బుజ్జగించి వారి వద్ద నుంచి తీసుకోవడం, కాకుంటే భాగస్వామ్యం ఇవ్వాలని పట్టుబట్టడం సర్వత్రా చర్చనీయాంశమైంది. తెల్లరాయి తరలింపు పూర్తి అనుమతులు వస్తే అధికార కూటమి ప్రభుత్వంలో ఎవరికి వారు యమునా తీరే అనేలా నడుచుకుంటారా, ప్రభుత్వంలోని పెద్దలు అప్పగించిన వారికే కట్టబెట్టి వారు ఇచ్చింది తీసుకుంటారో..? వేచి చూడాలి.



గూడూరు రూరల్ ప్రాంతంలోని మైన్‌లో లభించే తెల్లరాయి ఖనిజం

అనితర సాధ్యం!

- టీడీపీలో డెప్యూటీ మేయర్ దుమారం
- డబ్బు బలంతో అనూహ్యంగా తెరమీదకు వచ్చిన అనిత
- ఆది నుంచి పార్టీనే నమ్ముకున్న ఆర్సీ మునిక్రిష్ణకు రిక్తహస్తం
- డబ్బులుంటేనే డెప్యూటీ మేయర్ ఇవ్వాలని పార్టీ కీలక నిర్ణయం
- మంత్రి మాటలతో అలిగి వెళ్లిన పార్టీ విధేయుడు



సాక్షి, టాస్క్ ఫోర్స్: 'తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ డెప్యూటీ మేయర్ ఎన్నిక కూటమిలో చిచ్చురేపింది. డెప్యూటీ మేయర్ పదవికి సరిపడా బలం లేకున్నా అధికారం, ఆర్థిక బలంతో ఆ సీటు దక్కించుకునేందుకు ముమ్మర ప్రయత్నాలు చేసింది. అధికార పార్టీ కావడంతో కార్పొరేటర్లను ప్రలోభాలకు గురిచేసి ఎలాగైనా తమ పార్టీ తరపున బరిలో నిలిచే డెప్యూటీ మేయర్ అభ్యర్థిని గెలిపించుకోవాలని ఆ పార్టీ అధిష్టానం వ్యూహాలు రచించింది. ఇందులో భాగంగానే జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ శుక్రవారం తిరుపతి నగరానికి చేరుకుని స్థానిక నేతలతో సమావేశమయ్యారు. ఈ సమావేశంపై స్థానిక ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు సమాచారం లేదట. అనుచరుల ద్వారా విషయం తెలుసుకొని ఆయన మంత్రికి ఫోన్ చేసినట్లు తెలిసింది. దీంతో మంత్రి సమావేశానికి ఆహ్వానించినట్లు తెలిసింది. అనంతరం సమావేశానికి వెళ్లాక అక్కడ జరిగిన చర్చల్లో జనసేనకు విలువ ఇవ్వడం లేదని ఆరణి సమావేశంలోనే అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. దీంతో ఆరణిపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేసారని దాంతో ఎమ్మెల్యే అలిగి వెళ్లిపోయారని జనసేన వర్గీయులు మండిపడుతున్నారు. ఇదిలా ఉండగా సమావేశంలో ముందుగా టీడీపీ తరపున డెప్యూటీ మేయర్ పదవికి పోటీ పడుతున్న వారితో మాట్లాడి ఆర్థిక పరిస్థితులపై ఆరా తీసినట్లు సమాచారం.

పార్టీలో పైసలే ముఖ్యం!

మంత్రి అనగాని సత్యప్రసాద్ డబ్బున్న వారికే డెప్యూటీ మేయర్‌గా అవకాశం ఇస్తామని చెప్పడం పార్టీలో దుమారం రేపింది. అందులోనూ గత ప్రభుత్వంలో నిర్వహించిన తిరుపతి మేయర్ ఎన్నికల్లో టీడీపీ బీఫాం మీద గెలిచిన ఒకే ఒకవ్యక్తి ఆర్సీ మునిక్రిష్ణ. ఆయన డెప్యూటీ మేయర్ పదవి కావాలని కోరుకోవడంలో తప్పులేదు. వైఎస్సార్‌సీపీ బీఫాం మీద గెలిచి, టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టీ ఫిరాయించిన అనితకు ఆ పదవిని కట్టబెట్టాలని చూడడంలో అర్థం లేదని విశ్లేషకులు చెబుతున్నారు. అసలు బలం లేని చోట డెప్యూటీ మేయర్ స్థానానికి పోటీలో నిలవడమే తప్పుగా భావిస్తున్న తరుణంలో పార్టీనే నమ్ముకున్న వ్యక్తిని కాదని, పక్క పార్టీ నుంచి వచ్చిన వారికి అవకాశం ఇస్తుండడం పట్ల పలువురు తెలుగు తమ్ముళ్లు భగ్గుమంటున్నారు.

ఆశలు ఆవిరేనా?

టీడీపీ డెప్యూటీ మేయర్ అభ్యర్థిగా తనకే అవకాశం వస్తుందని ఎంతో ఆశగా ఎదురుచూసిన కార్పొరేటర్ ఆర్సీ.మునిక్రిష్ణకు ఆ సమావేశంలో ఎదురుదెబ్బ తగిలింది. టీడీపీ నేత అన్నా రామచంద్రయాదవ్ కుమార్తె అనిత డెప్యూటీ మేయర్ పదవికి ఆస్తకి చూపడంతో అనూహ్యంగా ఆమె పేరు తెరమీదకు వచ్చింది. టీడీపీ నుంచి ఆర్సీ మునిక్రిష్ణ, అనితల మధ్య పోటీ రావడంతో ఆ పంచాయితీ మంత్రి అనగాని వద్దకు చేరింది. నిజానికి డెప్యూటీ మేయర్ అవడానికి కావలసిన బలం టీడీపీకి లేనందున అక్కడ గెలవాలంటే కార్పొరేటర్లను ప్రలోభ పెట్టాల్సి ఉంటుంది. ఆ మేరకు అవసరమైన డబ్బులు ఎవరి దగ్గర ఉంటే వారికే ఆ పదవిని కట్టబెట్టాలన్న నిర్ణయానికి సమావేశంలో మంత్రి తీర్మానించినట్లు సమాచారం. దీంతో పార్టీనే నమ్ముకున్న ఆర్సీ మునిక్రిష్ణ అనగాని వ్యాఖ్యలపై అసహనం వ్యక్తం చేస్తూ అక్కడి నుంచి అలిగి వెళ్లినట్లు సమాచారం.

కార్పొరేటర్లపై పోలీసుల నిఘా!

తిరుపతి కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ పదవికి ఎన్నికలు సమీపిస్తుండడంతో కార్పొరేటర్లను ప్రలోభ పెట్టే ప్రయత్నాలు టీడీపీ వేగవంతం చేసింది. ఆ విషయంలో ప్రభుత్వ పెద్దలు అనుకున్నంత సులువు కాకపోవడంతో పోలీసులు, రెవెన్యూ అధికారులను రంగంలోకి దించింది. తమకు అనుకూలంగా రాని వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ల కదలికలను ఎప్పటికప్పుడు పసిగట్టాలని, ఆ వివరాలు తమకు తెలియజేయాలని ఆదేశాలు రావడంతో పోలీసులు గట్టి నిఘా ఏర్పాటు చేశారు. కొంతమంది పోలీసులు ఏకంగా కార్పొరేటర్లకు ఫోన్లు చేసి ఎక్కడ ఉన్నారు, మీరు ఇబ్బందులు పడకూడదు అనుకుంటే టీడీపీకి అనుకూలంగా మనసు మార్చుకోవాలని ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం. అంతేగాక కార్పొరేటర్లకు సంబంధించి ఏదైనా భూ వివాదాలు ఉన్నట్లయితే వాటిని బూచీగా చూపించి రెవెన్యూ అధికారులు బెదిరిస్తున్నట్లు తెలుస్తోంది. డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో బలం లేకున్నా అడ్డదారిన గెలవడానికి వ్యూహాలు రచిస్తున్న టీడీపీకి కార్పొరేటర్ల ఓటు కీలకం కావడంతో వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ల కదలికలపై నిఘా పెట్టింది.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు


ప్రమాదంలో దెబ్బతిన్న కారు

చంద్రగిరి: కారు అదుపు తప్పి కాలువలోకి దూసుకెళ్లడంతో ఇద్దరు గాయాలపాలైన ఘటన పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారి తొండవాడ సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. బెంగళూరులోని బనశంకరికి చెందిన వసుధ తన కుటుంబ సభ్యులతో కలసి కారులో తిరుమలకు బయల్దేరారు. తొండవాడ వద్ద వస్తున్న క్రమంలో కారు అదుపు తప్పి రహదారి పక్కన ఉన్న కాలువలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో కారు డ్రైవరు మనుతో పాటు వసుధకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను తిరుపతి రుయాకు తరలించారు.

తెల్లరాయి నిల్వలపై దాడులు

సైదాపురం: మండలంలోని ఓరుపల్లి సమీపంలో అక్రమంగా నిల్వ ఉంచిన తెల్లరాయిని శుక్రవారం జిల్లా మైనింగ్ అధిరులు దాడులు చేసి స్వాధీనం చేసుకున్నారు. సుమారు 120 టన్నులకు పైగా మూడు లారీల ఖనిజాన్ని స్వాధీనం చేసుకుని రెవెన్యూ అధికారులకు అప్పగించారు. వివరాలు.. పొదలకూరు మండలంలోని డేగపూడి వద్ద ఉన్న మైన్‌లో దొంగతనంగా తెల్లరాయిని తీసుకుని ఓరుపల్లి వద్ద నిల్వ ఉంచారంటూ జోగిపల్లి గ్రామానికి చెందిన శివ కృష్ణ జనవరి 27న పోలీసులకు, మైనింగ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మైనింగ్ ఆర్ఐ స్వాతి తన సిబ్బందితో కలిసి ఓరుపల్లి గ్రామంలో నిల్వ ఉన్న ప్రాంతానికి చేరుకుని తెల్లరాయిని స్వాధీనం చేసుకున్నారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 3 కంపార్ట్‌మెంట్లు నిండాయి. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.14 కోట్లు సమర్పించారు. దర్శన టికెట్లు లేని వారికి 8 గంటలు పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లున్న వారికి 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

టీటీడీ దాతల పేరుతో..

తిరుమల: టీటీడీ దాతల పేరుతో నకిలీ వీఐపీ బ్రేక్ దర్శన టికెట్లను విక్రయించి మోసగించిన దళారీపై తిరుమల వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో గురువారం రాత్రి కేసు నమోదు చేశారు. ఆ వివరాలను శుక్రవారం పోలీసులు వెల్లడించారు. తిరుమల వన్‌టౌన్ ఎస్ఐ రమేష్‌బాబు కథనం.. హైదరాబాద్‌కు చెందిన ఎం.ఉపేందర్ కుటుంబ సభ్యులతో కలసి శ్రీవారిని దర్శించుకునేందుకు సహకరించాలని హైదరాబాద్‌కు చెందిన నళినీకాంత్‌ను సంప్రదించాడు. అతను తనకు తెలిసిన సతీష్ అనే దళారీని వారికి పరిచయం చేశాడు. సదరు సతీష్ ముగ్గురు భక్తులకు గత నెల 20వ తేదీకి టీటీడీ రూ.10లక్షల దాతల వీఐపీ బ్రేక్ దర్శన టికెట్‌ను ఇప్పిస్తానని అందుకు రూ.2,100 అవుతుందని తెలిపాడు. దీంతో భక్తుడు నగదును ఫోన్ పే ద్వారా పంపపాడు. అనంతరం దళారీ దాతలకు ఇచ్చే వీఐపీ బ్రేక్ దర్శనం టికెట్ అని తెలిపి.. వారికి దర్శన టికెట్‌ను పంపాడు. ఆ టికెట్‌తో జనవరి 29న భక్తుడు వైకుంఠం క్యూకాంప్లెక్స్–1లో దర్శనానికి వెళ్లాడు. ఆ టికెట్‌ను స్కానింగ్ చేయగా నకిలీదిగా తేలింది.

వెంకటగిరిలో కూటమి దౌర్జన్యకాండ

- చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటున్న కూటమి నేతలు
- ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న రెవెన్యూ, పోలీసు అధికారులు
- అమాయకులపై అక్రమ కేసులు
- రాజ్యమేలుతున్న రెడ్‌బుక్ రాజ్యాంగం


వైఎస్సార్‌సీపీ సానుభూతి పరుల ఇళ్లను ధ్వంసం చేసిన అధికారులు (ఫైల్)


కూటమి నేతల దాడిలో గాయపడి చికిత్స పొందుతున్న పేచీరాజ్ (ఫైల్)

సాక్షి,టాస్క్‌ఫోర్స్: వెంకటగిరి నియోజకవర్గంలో రెడ్ బుక్ రాజ్యాంగం రాజ్యమేలుతోంది. అమాకులనే టార్గెట్‌గా చేసుకుని చెలగాటమాడుతోంది. పేదలపై అక్రమ కేసుల నుంచి ఇళ్ల కూల్చివేత వరకు అరాచకం.. దౌర్జన్యం చెలరేగుతోంది. ఈ క్రమంలో నియోజకవర్గంలోని వెంకటగిరి, బాలాయపల్లి, డక్కిలి, రాపూరు, సైదాపురం, కలువాయి మండలాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం వెలదీస్తున్నారు. కనీసం పోలీసు స్టేషన్ గడప తొక్కాలన్నా హడిలిపోతున్నారు. ఇక రెవెన్యూ శాఖ ఏకపక్షంగానే వ్యవహరిస్తుండడం గమనర్హం. కేవలం వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులతోపాటు ప్రజాప్రతినిధులను టార్గెట్ చేసుకుని కూటమి నేతలు మరింత రెచ్చిపోతున్నారు. సామాన్యుడి నుంచి నియోజకవర్గ ఇన్‌చార్జి వరకు కేసులు నమోదు చేసి ముప్పుతిప్పలు పెడుతోంది.

ఏడు నెలల్లో జరిగిన అరాచకాలు కొన్ని

- వెంకటగిరి పట్టణంలోని 7వ వార్డుకు చెందిన వైఎస్సార్‌సీపీ సానుభూతి పరుడు తంగా పేచీరాజ్ పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తుంటారు. కూటమి నేతలు అతనిపై పగ పట్టి కక్షసాధింపు చర్యలకు పూనుకున్నారు. పేచీరాజ్‌పై దాడి చేసి గాయపరిచారు. ఈ ఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయింది. పోలీసులు తెల్లవారుజామున పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లి అక్రమంగా గంజాయి కేసు బనాయించి జైలుపాలు చేశారు.
- పార్టీ పిలుపు మేరకు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసు అనుమతులతో వెంకటగిరి పట్టణంలో శాంతియుతంగా విద్యుత్ పోరుబాట కార్యక్రమం నిర్వహించారు. అదే సమయంలో కూటమి నేతకు చెందిన ఓ చోటా నాయకుడు ర్యాలీని అడ్డుకునే ప్రయత్నం చేశారు. సాక్షాతు పోలీసులే ఈ ఘటన చూసి ఆ చోటా నేతను పక్కకి తీసుకెళ్లి సర్దిచెప్పారు. అయితే స్థానిక ప్రజాప్రతినిధి సహకారంతో నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తోపాటు మరో 11 మందిపై తప్పుడు కేసులు నమోదు చేశారు.
- రోడ్డు విస్తరణలో భాగంగా పట్టణంలోని 9వ వార్డులో ప్రజలకు కనీస సమాచారం, నోటీలు జారీ చేయకుండా వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులైన ఇళ్లను మున్సిపల్, రెవెన్యూ అధికారుల సమక్షంలో పోలీసు బందోబస్తు మధ్య కూల్చివేశారు. ఈ బాధను భరించలేక బాధితుడు చిల్లకూరు శివరామిరెడ్డి మృతి చెందారు.
- సైదాపురం మండలం, చాగణం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియ కార్యకర్త చిరంజీవిపై సైదాపురం పోలీసులు తప్పుడు కేసు నమోదు చేశారు.
- బాలాయపల్లి మండలం, మన్నూరు గ్రామానికి చెందిన కాటూరు రామతులసికి సంబంధించిన వ్యవసాయ భూమిని అధికార పార్టీ అనుకూల వ్యక్తులు కొందరు ఆక్రమించారు. దీనిపై ప్రశ్నించినందుకు రామతులసి, ఆమె అనుచరులపై దాడికి పాల్పడ్డారు. ఆపై బాలాయపల్లి పోలీసు స్టేషన్‌లో కేసులు నమోదు చేయించారు.
- సైదాపురం పంచాయతీ, కమ్మవారిపల్లి గిరిజన కాలనీకి చెందిన కొందరు గిరిజనులు ప్రభుత్వ భూమిని సాగుచేసుకుంటున్నారు. కూటమి నేత వారిపై ఫిర్యాదు చేయడంతో రెవెన్యూ అధికారులు గిరిజనులపై తప్పుడు కేసును బనాయించారు.
- రాపూరు మండలం వైఎస్సార్‌సీపీ నేత పాపకన్ను మధుసూదన్‌రెడ్డికి సంబంధించిన వ్యవసాయ భూములు స్వాధీనం చేసుకునేందుకు కూటమి నేతలు కుట్ర పన్నారు. ఆ నేతకు చెందిన సాగు భూమికి వేసిన కంచెను తొలగించి బీభత్సం సృష్టించారు.
- డక్కిలి మండలంలోని డి ఉప్పరపల్లిగొల్లపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత బొల్లినేని భాస్కర్ నాయుడు జనవరి 28వ తేదీన స్వగ్రామానికి రావడంతో పథకం ప్రకారం కూటమి నేతలు అతనిపై తప్పుడు కేసులు బనాయించారు.


శాంతియుతంగా పోరుబాట ర్యాలీ చేస్తుంటే కూటమి నేత వీరంగం(ఫైల్)

ఎవ్వరినీ వదలం



నియోజకవర్గ ప్రజలపై తప్పుడు కేసులు పెట్టిన ఎవరీ వదలబోం. నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న అక్రమాలు, అన్యాయాలు, బెదిరింపులు, దౌర్జన్యాలకు బెదిరే సమస్యే లేదు. త్వరలోనే కూటమి ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్పేరోజు దగ్గరలోనే ఉంది. ప్రజలకు సేవ చేసి మంచి పేరు తెచ్చుకోవాల్సిన రెవెన్యూ, పోలీసు అధికారులు పేద ప్రజలపై తప్పుడు కేసులు బనాయిస్తున్నారు. కేసులకు భయపడేవాడిని కాదు. కార్యకర్తలకు అన్యాయం జరిగితే సహించేది లేదు.
– నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, వెంకటగిరి నియోజకవర్గం

28 నుంచి సదర్వ ఈవెంట్-2025


సదర్వ ఈవెంట్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ, రిజిస్ట్రార్

తిరుపతి సిటీ : పద్మావతి మహిళా వర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో ఫిబ్రవరి 28 నుంచి రెండు రోజులు సదర్వ ఈవెంట్–2025 నిర్వహించనున్నట్లు వీసీ ప్రొఫెసర్ ఉమ తెలిపారు. ఆమె శుక్రవారం ఈవెంట్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఏటా క్రమం తప్పకుండా సదర్వ ఈవెంట్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఇందులో విద్యార్థులకు పోస్టర్, పేపర్ ప్రెజెంటేషన్, ప్రాజెక్ట్ ఎక్స్‌పో, వర్క్ షాప్‌తో పాటు టెక్నికల్ గేమ్స్ నిర్వహిస్తామన్నారు. పలు ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులు పాల్గొననున్నట్టు వెల్లడించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఎన్ రజిని, ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ మల్లికార్జున, అధ్యాపకులు బి.మాధవి, శ్రీనివాస పద్మజ, డాక్టర్ రామకృష్ణ, స్టూడెంట్ కన్వీనర్ ఇందుశ్రీ, స్టూడెంట్ కో–కన్వీనర్ భాను ప్రశాంతి పాల్గొన్నారు.

మెరుగైన సౌకర్యాలే లక్ష్యం

తిరుపతి అర్బన్: ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలను కల్పించడమే లక్ష్యంగా రైల్వే అధికారులు చర్యలు చేపట్టాలని సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ ఆదేశించారు. శుక్రవారం ఆయన తిరుపతి రైల్వే స్టేషన్‌కు పడమర వైపు రూ.3 కోట్ల వ్యయంతో నిర్మించనున్న కల్యాణ మండపానికి శంకుస్థాపన చేశారు. ఇటీవల కొందరు అధికార పార్టీ నేతలు ఆ స్థలాన్ని ఆక్రమించడానికి ప్రయత్నాలు చేసిన సంగతి తెలిసిందే. దీంతో దక్షిణ మధ్య రైల్వే అధికారులు జోక్యం చేసుకుని శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన రూ.315 కోట్లతో తిరుపతి రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులను పరిశీలించారు. వచ్చే ఏప్రిల్ నాటికి దక్షిణం వైపు పనులు పూర్తికావాలన్నారు. ఉత్తరం వైపు నిర్మాణాలు అదే నెలలో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. తిరుచానూరు రైల్వే స్టేషన్ పనులు పూర్తి చేసినప్పటికీ ప్రయాణికులకు ఎందుకు అందుబాటులోకి తీసుకురాలేదో చెప్పాలని ప్రశ్నించారు. అనంతరం తిరుపతి నగరంలోని శ్రీదేవి కాంప్లెక్స్ సమీప ప్రాంతంలో నివాసం ఉంటున్న కృష్ణయ్య అనే వైద్యులు తిరుపతి రైల్వే స్టేషన్‌కు రెండు వీల్ చైర్స్‌తోపాటు స్ట్రెచర్‌ను విరాళంగా జీఎం చేతుల మీదుగా అందించారు. వారితోపాటు గుంతకల్లు డివిజన్ రైల్వే అధికారి చంద్రశేఖర్ గుప్తా, తిరుపతి స్టేషన్ డైరెక్టర్ సత్యనారాయణ, స్టేషన్ మాస్టర్ చిన్నరెడ్డెప్ప, ఇంజినీరింగ్ అధికారులు ఉన్నారు.


నూతన కల్యాణ మండపానికి భూమి పూజ చేస్తున్న దక్షిణ మధ్య రైల్వే జీఎం

తిరుచానూరు రైల్వే స్టేషన్ పరిశీలన

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట) : సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ శుక్రవారం తిరుచానూరు రైల్వే స్టేషన్‌ను పరిశీలించారు. అభివృద్ధి పనులపై పలు సూచనలు చేశారు. అనంతరం రేణిగుంట రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. ఆయనకు రైల్వే లైసెన్స్ కూలీ పోర్టర్లు స్వాగతం పలికారు. సమస్యలపై వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో గుంతకల్ డివిజనల్ రైల్వే మేనేజర్ చంద్రశేఖర్ గుప్తా, స్టేషన్ మేనేజర్ శేషగిరినాథరెడ్డి, గుంతకల్లు, సికింద్రాబాద్ అధికారులు పాల్గొన్నారు. అనంతరం జనరల్ మేనేజర్ ఇన్‌స్పెక్షన్ స్పెషల్ ట్రైన్‌లో గుంతకల్లుకు బయలుదేరి వెళ్లారు.

నిర్లక్ష్యం జాతర.. ల్యాబ్‌లకు పాతర!

- ల్యాబ్‌ల్లో బూజు పట్టిన పరకరాలు, రసాయనాలు
- కొన్ని కళాశాలల్లో కాగితాలకే పరిమితం
- 15 కళాశాలలకు నోటీసులు
- ఫిబ్రవరి 10 నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షలు
- నిధులకు కోత విధించిన కూటమి సర్కార్


ప్రైవేటు కళాశాలల్లోని ల్యాబ్‌లను తనిఖీ చేస్తున్న ఆర్ఐఓ

తిరుపతి జిల్లా వివరాలు

ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 21	ఎయిడెడ్ జూనియర్ కళాశాలలు 01
ప్రైవేటు జూనియర్ కళాశాలలు 118	జనరల్ ప్రాక్టికల్స్ పరీక్షా కేంద్రాలు 124
ప్రాక్టికల్స్‌కు హాజరయ్యే జనరల్ విద్యార్థులు 23,793	ఒకేషనల్ ప్రాక్టికల్స్ పరీక్షా కేంద్రాలు 23
పరీక్షకు హాజరయ్యే ఒకేషనల్ విద్యార్థులు 2,261	

తిరుపతి ఎడ్యుకేషన్ : ప్రయోగాలు కొత్త విషయాలను నేర్పుతాయి. కొత్త ఆవిష్కరణలకు తోడ్పడుతాయి. దీనికోసమే చిన్నతనం నుంచే విద్యార్థులకు ప్రయోగాలతో కూడిన విద్యాబోధనను అందిస్తున్నారు. గణితం, సైన్స్‌కు సంబంధించిన పాఠ్యాంశాలు వంద శాతం విద్యార్థులకు అర్థం అవ్వాలంటే ప్రయోగాలు తప్పనిసరి. ముఖ్యంగా ఇంటర్మీడియెట్‌లో చేరిన సైన్స్, మ్యాథ్స్ విద్యార్థులకు అకడమిక్ క్యాలెండర్ ప్రకారం విద్యాసంవత్సరం ప్రారంభం నుంచే తప్పనిసరిగా ప్రయోగాలు చేయించాల్సి ఉంది. అయితే చాలా వరకు కార్పొరేట్, ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు ప్రయోగం కడు దూరమవుతున్నాయి.

నామమాత్రం

ప్రైవేటు, కార్పొరేట్ జూనియర్ కళాశాలలు థియరీ, పోటీ పరీక్షలకు ఇస్తున్న ప్రాధాన్యత ప్రాక్టికల్స్‌కు ఇవ్వడం లేదన్నది జగమెరిగిన సత్యం. కొన్ని కళాశాలల్లో ల్యాబ్‌లు కాగితాలకే పరిమితమయ్యాయి. ల్యాబ్‌లున్న కళాశాలల్లో అధిక భాగం ప్రయోగాలు చేయించడం లేదు. ఇక కొన్ని కళాశాలు విద్యార్థులతో నామమాత్రంగా ప్రాక్టికల్స్ చేయించి చేతులు దులుపుకుంటున్నాయి. ప్రాక్టికల్స్ పరీక్ష దగ్గర పడుతుండడంతో కొన్ని కళాశాలలు హడావుడిగా విద్యార్థులను ల్యాబ్‌లకు తీసుకెళ్లి ప్రాక్టికల్స్‌ను తూతూమంత్రంగా చేయిస్తున్నట్లు తెలుస్తోంది.

నిధులకు కోత

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జూనియర్ కళాశాలల్లో ప్రయోగాల నిర్వహణకు ఏటా రూ.30 వేల నుంచి రూ.50వేల వరకు నిధులు విడుదల చేసేది. దీంతో ఆయా కళాశాలల్లో ప్రాక్టికల్స్‌ను నిర్వహించేవారు. అయితే కూటమి ప్రభుత్వం ప్రాక్టికల్స్‌కు ఇచ్చే నిధుల్లో కోత విధించింది. ఈ విద్యాసంవత్సరం విద్యార్థి చెల్లించే రూ.2వేల ఫీజుతో పాటు అదనంగా రూ.400 ప్రయోగాలకు కేటాయిస్తోంది. వసూలు చేసిన మొత్తం ల్యాబ్‌ల్లో పరికరాలు, రసాయనాల కొనుగోలుకు సరిపోకపోవడంతో ఆయా కళాశాలల్లో అధ్యాపకులు ఇబ్బందులు పడుతున్నారు. అరకొరగా ప్రయోగాలు చేయించి సరిపెట్టేస్తున్నారు.

అటకెక్కిన బోర్డు నిబంధనలు

బోర్డు నిబంధనల మేరకు మొదటి సంవత్సరం నుంచే విద్యార్థులతో ప్రాక్టికల్స్ చేయించాల్సి ఉంది. ప్రాక్టికల్స్‌కు ప్రత్యేకంగా పీరియడ్లను కేటాయించాలి. అయితే కార్పొరేట్, ప్రైవేటు కళాశాలలు ఆ నిబంధనలకు పాతరేసింది. ప్రాక్టికల్స్ చేయించకుండా విద్యార్థులతో రికార్డులతో సరిపెట్టిస్తోంది. ప్రాక్టికల్స్ పీరియడ్లను థియరీ, జేఈఈ, నీట్ వంటి పోటీ పరీక్షలకు వినియోగిస్తోంది. అయితే ఇలాంటి కళాశాలలపై చర్యలు తీసుకునే వెసులుబాటు అధికారులకు లేకపోవడంతో చూస్తూ మిన్నుకుండిపోతున్నారు.

బూజు పట్టిన పరికరాలు

ఇంటర్ ఒకేషనల్ విద్యార్థులకు ఫిబ్రవరి 5 నుంచి 20వ తేదీ వరకు, జనరల్ విద్యార్థులకు ఫిబ్రవరి 10 నుంచి 20వ తేదీ వరకు ప్రాక్టికల్స్ పరీక్షలను నిర్వహించనున్నారు. దీనికి సంబంధించి ఆయా కళాశాలలకు బోర్డు నుంచి సమాచారం చేరింది. ఈ నేపథ్యంలో బోర్డు అధికారులు కళాశాలల్లో ల్యాబ్‌ల పరిస్థితి ఎలా ఉందో తెలుసుకునేందుకు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో కార్పొరేట్, ప్రైవేటు కళాశాలల్లో ల్యాబ్‌లు నామమాత్రంగా ఉన్నట్లు గుర్తించారు. చాలా కళాశాలల్లోని ల్యాబ్‌ల్లో ఉన్న రసాయనాలు, స్పెసిమన్లు అలమరాలకే పరిమితమవ్వగా, పరికరాలు బూజు పట్టి ఉన్నట్లు గుర్తించారు. విద్యార్థులతో ఎటువంటి ప్రయోగాలు చేయించడం లేదని తనిఖీల్లో గుర్తించడంతో ఆయా కళాశాలలకు నోటీసులను జారీచేశారు.

నోటీసులు జారీచేశాం



ఇంటర్ బోర్డు నిబంధనల మేరకు తప్పనిసరిగా ప్రాక్టికల్స్ తరగతులను మొదటి ఏడాది నుంచే నిర్వహించాలి. అందుకు అనుగుణంగా ల్యాబ్‌లు, పరికరాలు, రసాయనాలు ఏర్పాటుచేసుకోవాలని విద్యాసంవత్సరం ప్రారంభంలోనే అన్ని కళాశాలలకు ఉత్తర్వులు ఇచ్చాం. ఇటీవల ప్రాక్టికల్స్ తరగతుల నిర్వహణపై జిల్లా వ్యాప్తంగా తనిఖీలు చేపట్టాం. ప్రాక్టికల్స్ చేపట్టని సుమారు 15 కళాశాలలకు నోటీసులు, నామమాత్రంగా చేయిస్తున్న కళాశాలల ప్రిన్సిపాళ్లకు హెచ్చరికలు జారీచేశాం. – జీవీ.ప్రభాకర్‌రెడ్డి, ఇంటర్ ప్రాంతీయ పర్యవేక్షణాధికారి(ఆర్ఐఓ), తిరుపతి

వసతిగృహాల్లో మెరుగైన సౌకర్యాలు


కలెక్టర్‌ను కలిసిన ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ వసంతా బాయ్

తిరుపతి అర్బన్: ఎస్సీ వసతి గృహాల్లో మెరుగైన సౌకర్యాలను కల్పించడంలో ముందుంటానని ఆ విభాగం జిల్లా అధికారి విక్రమకుమార్‌రెడ్డి తెలిపారు. జిల్లాలో పనిచేస్తున్న చెన్నయ్య చిత్తూరు జిల్లాకు బదిలీ అవగా..విజయవాడ డైరెక్టరేట్‌లో పనిచేస్తున్న విక్రమకుమార్‌రెడ్డి తిరుపతి జిల్లాకు విచ్చేశారు. ఈ క్రమంలో ఆయన శుక్రవారం కలెక్టరేట్‌లోని తమ చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మర్యాదపూర్వకంగా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌ను కలిశారు. తర్వాత ఆయన మాట్లాడుతూ వారం రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా అన్ని ఎస్సీ వసతి గృహాల్లోని సమస్యలను పూర్తిగా తెలుసుకుంటామని, అనంతరం వాటికి పరిష్కారం చూపుతామని పేర్కొన్నారు. ప్రధానంగా విద్యార్థులకు నాణ్యమైన భోజన వసతి కల్పించాలని వెల్లడించారు.

బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం

అంగన్‌వాడీ పాఠశాలల్లో బాలింతలు, గర్భిణులకు క్రమంతప్పకుండా పౌష్టికాహారాన్ని అందిస్తామని ఐసీడీఎస్ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ వసంతాబాయ్ పేర్కొన్నారు. జిల్లాలో పీడీగా పనిచేస్తున్న జయలక్ష్మి పదోన్నతిపై నాలుగు రోజుల క్రితం ఒంగోలు ఆర్జేడీగా బదిలీపై వెళ్లారు. ఈ క్రమంలో కడపలో పనిచేస్తున్న వసంతాబాయ్ తిరుపతికి బదిలీపై వచ్చారు. ఆ మేరకు ఆమె శుక్రవారం కలెక్టరేట్‌లోని తమ చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. తర్వాత ఆమె మాట్లాడుతూ అన్ని అంగన్‌వాడీ స్కూల్స్ నుంచి క్రమం తప్పకుండా బాలింతలు, గర్భవతులకు పౌష్టికఆహారాన్ని అందిస్తామని స్పష్టం చేశారు.

పారిశ్రామికవేత్తలుగా 'రాణి'ంచాలి


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న అధికారులు

నాయుడుపేట టౌన్ : మహిళలు పారిశ్రామికవేత్తలుగా రాణించాలని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ టీఎన్ శోభన్‌బాబు పిలుపునిచ్చారు. నాయుడుపేట సంఘమిత్ర కార్యాలయంలో శుక్రవారం నాయుడుపేట, గూడూరు, శ్రీకాళహస్తి క్లస్టర్లలోని మండలాలకు సంబంధించి పీఎం ఎఫ్ ఎంఈ, ఈజీపీ కేవీఐసీలకు కొత్తగా రుణాల కోసం నమోదు చేసుకున్నా ఔత్సాహిక వేత్తలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్ వారి సౌజన్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి పీడీ ప్రత్యేక అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఔత్సాహిక వేత్తలకు కేవీఐసీ ద్వారా అందించే సేవల గురించి వివరించారు. మహిళలు తయారు చేస్తున్న ఫుడ్ ప్రొడక్ట్స్, జూట్ బ్యాగుల తయారీ, నిల్వ పచ్చళ్లు, అప్పడాల తయారీ తదితరాల వాటిలో మేలకులపై కేవీఐసీ ఏడీ కోటిరెడ్డి శిక్షణ ఇచ్చారు. ఇంకా డైరెక్టర్ శ్యాముల్ గ్రిప్, ఎల్‌డీఎం విశ్వనాథ్‌రెడ్డి, ఏడీ వెంకట్‌రామ్ రెడ్డి, జిల్లా జీవనోపాధులు అధికారి టీ.ధనుంజయరెడ్డి మాట్లాడారు. నాయుడుపేట ఏపీఎం ఉమాదేవి, సీసీలు, మహిళా పారిశ్రామిక వేత్తలు పాల్గొన్నారు.

ఎస్వీయూలో చిరుత హల్‌చల్


ఐ బ్లాక్ హాస్టల్ ప్రాంతంలో జింక కళేబరం

తిరుపతి సిటీ: ఎస్వీయూ ప్రాంగణంలో గురువారం రాత్రి చిరుత హల్‌చల్ చేసింది. వర్సిటీలోని ఐ బ్లాక్ మెన్స్ హాస్టల్ సమీపంలోని చెట్లపొదల్లో జింకను వేటాడి సంహరించింది. దీంతో వర్సిటీ అధికారులు విద్యార్థులను, ఉద్యోగులను అప్రమత్తం చేశారు. ఇప్పటికే అటవీశాఖ అధికారులు వర్సిటీ ప్రాంగణంలో చిరుత సంచరిస్తున్న ప్రాంతాలను పసిగట్టి సీసీ కెమెరాలను అమర్చారు. కానీ బోన్లను అమర్చి చిరుతను బంధించడంలో విఫలమయ్యారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వర్సిటీలలో బోన్లు ఏర్పాటు చేసే దిశగా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

బీఈడీ ఫస్ట్ సెమ్ ఫలితాలు విడుదల

తిరుపతి సిటీ : ఎస్వీయూ పరిధిలో గత ఏడాది ఆగస్టులో నిర్వహించిన బీఈడీ మొదటి సెమిస్టర్ ఫలితాలను శుక్రవారం విడుదల చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఎం దామ్లానాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫలితాల కోసం వర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌లో చూడాలని సూచించారు.

3న స్విమ్స్‌లో డ్రైవర్ పోస్టులకు వాక్ ఇన్ ఇంటర్వ్యూ

తిరుపతి తుడా : స్విమ్స్ ఆస్పత్రిలో కాంట్రాక్టు ప్రాతిపదికన డ్రైవర్ పోస్టుల భర్తీకి ఈనెల 3న వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు రిజిస్ట్రార్ ఒక ప్రకటనలో తెలిపారు. రెండు పోస్టులు ఉన్నాయని, ఒకటి ఓసీకి, మరొకటి బీసీ ఏకి కేటాయించినట్లు వెల్లడించారు. అర్హత, జీతభత్యాలు, దరఖాస్తుల కోసం స్విమ్స్ అధికారిక వెబ్‌సైట్‌ను చూడాలని సూచించారు.